క్లుప్తంగా

అంతర్జాతీయ మదర్ అవార్డు ప్రదానం



గార్ల: జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, మద్రిగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయం ఈఓ నందనం కవిత ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంతర్జాతీయ మదర్ అవార్డును అందుకున్నారు. మాతృ దినోత్సవం పురస్కరించుకొని వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ మాతృమూర్తులకు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

నెహ్రూసెంటర్: నూతన కలెక్టరేట్ కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా పైండ్ల యాకయ్య మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు, అధికారులు కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారని, ఈనేపథ్యంలో వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ ఏరియా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి పార్కింగ్ ఏర్పాటుకు చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి కందాల రంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ల్యాదల్ల రాజు, వెంకన్న పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ



తొర్రూరు రూరల్: మండలంలోని గోపాలగిరి గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ధర్మయ్య కుటుంబాన్ని, చెర్లపాలెం గ్రామానికి చెందిన ప్రమాదానికి గురై ఇంటి వద్దనే ఉంటున్న బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు వాసురెడ్డిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో మండల రైతు కోఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు సట్ల నాగలక్ష్మి, ధర్మరావు శ్రీనివాస్, ఎంపీటీసీ ధర్మరావు కిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి



బయ్యారం: ఆదివాసీల అస్తిత్వ రక్షణ కోసం ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సును జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘం జిల్లా నాయకులు చింతా వెంకన్న పిలుపునిచ్చారు. సదస్సు జయప్రదం కోరుతూ ముద్రించిన పోస్టర్లను ఆదివారం ఆయన మండలంలోని వెంకట్రాంపురం, గౌరారంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రామకృష్ణ, రాములు, వెంకటమ్మ, పద్మ, వెంకన్న, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల విరాళం

కేసముద్రం: మండలంలోని మహముద్‌పట్నం గ్రామంలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనకు గాను సర్పంచ్ శతకోటి సారమ్మ ఆదివారం రూ.2లక్షల విరాళాన్ని బొడ్రాయి కమిటీకి అందజేశారు.

ట్రాక్టర్ డ్రైవర్ అరెస్టు

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 12న మక్కల రాశివద్ద నిద్రిస్తున్న నెక్కొండ మండలం గొట్లకొండతండాకు చెందిన లకావత్ శాంతి అనే మహిళా రైతు కాలుపై నుంచి గుర్తు తెలియని వ్యక్తి ట్రాక్టర్ తీసుకెళ్లడంతో తీవ్రగాయాలు కాగా, ట్రాక్టర్‌ను ఆపకుండా డ్రైవర్ పరారైన విషయం తెలిసిందే. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై తిరుపతి దర్యాప్తు చేపట్టారు. దీంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ జరపగా, మద్రితండాకు చెందిన వాంకుడోతు రాంజీగా గుర్తించి, అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటినుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

బయ్యారం: మండల కేంద్రంలో సోమవారం నుంచి నిర్వహించనున్న సీఎం కప్ క్రీడలను క్రీడాకారులు విజయవంతం చేయాలని ఎంపీపీ చేపూరి మౌనిక అన్నారు. బయ్యారంలోని క్రీడామైదానంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటరమణ, మండల పరిషత్ టైపిస్ట్ గౌసుద్దిన్, పీడీ వాల్యా, పీఈటీ పద్మ పాల్గొన్నారు.

దంతాలపల్లి: నేటినుంచి మూడు రోజుల వరకు మండల కేంద్రంలో నిర్వహించే సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీఓ అప్సర్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా హనుమాన్ జయంతి

గూడూరు: మండల కేంద్రంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను హనుమాన్ మాలాధరులు, భక్తులు వైభవంగా నిర్వహించారు. హోమ పూజలు నిర్వహించి ఆంజనేయ స్తోత్రం పఠించారు. ప్రధాన బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్‌యాదవ్ మహా అన్నదానం చేశారు.

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి విగ్రహాన్ని సింధూరం, తమలపాకులతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పుప్పా రమణ, భారతి దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

కురవి: మండలంలోని మోద్గులగూడెం, గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామాల్లో మోద్గులగూడెం గ్రామంలో ఆంజనేయ స్వామి భక్తులు భారీ ర్యాలీ చేశారు. గుండ్రాతిమడుగులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను రంగాభట్టార్ ఆధ్వర్యంలో నిర్వహించి అన్నదానం చేశారు.

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలో పరిధితలో ఆలయాల్లో పూజలు నిర్వహించి, జాతీయ రహదారి హనుమాన్ భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నెల్లికుదురు: మండలంలోని హనుమాన్ నగర్ తండాలోని అభయాంజనేయ స్వామి దేవాలయంతో పాటు వివిధ గ్రామాలల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు.

మహబూబాబాద్ రూరల్: హనుమాన్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలు, తండాల్లో ఆదివారం వైభవంగా జరుపు న్నారు. శ్రీరామ ఆలయంలో ఆంజనేయ స్వామి వారికి మాజీ సర్పంచ్ ఘనశ్యాందాస్ ఝువర్ కుమారుడు దీపక్ ఝువర్ మకరతోరణం చేయించి సమర్పించారు.

కేసముద్రం: మండల కేంద్రంతోపాటు, ఉప్పరపల్లి, కల్వల, ధన్నసరి గ్రామాల్లో, ఇనుగుర్తి మండల కేంద్రంతోపాటు, లాలుతండాజీపీ శివారు వీరారెడ్డిపల్లి గ్రామాల్లో గల ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పెద్దవంగర: మండలంలోని గంట్లకుంట గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, ఎంపీటీసీ అనురాధ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గార్ల: గార్లలోని తూర్పు ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు.



డోర్నకల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మహబూబాబాద్ రూరల్: హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్ర..



మరిపెడ: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు



కురవి: మోద్గులగూడెంలో..



గూడూరు: హనుమాన్ దేవాలయం వద్ద..



కేసముద్రం: ఇనుగుర్తి మండలం వీరారెడ్డిపల్లిలో..



గార్లలో ..

మామిడి తోటలో ఆంజనేయస్వామి



డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో మామిడితోటలో కొలువై ఆంజనేయ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పరంకుశం అభినాష్ రోజంతా శ్రమించి గర్భగుడిని మామిడితోటగా మార్చి భక్తులకు ఆశ్చర్యానికి గురిచేశారు. తమిళనాడులో ఈ తరహా అలంకరణలో ఆంజనేయస్వామి భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు. గ్రామానికి చెందిన భక్తులు పోటు చంద్రం దంపతులు ఆంజనేయస్వామి అలంకరణకు ఆర్థికంగా సహకరించారు.

సువర్ణలక్ష్మి విగ్రహప్రతిష్ఠాపన

కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామంలో సువర్ణలక్ష్మీ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆదివారం ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ్రెడ్డి శ్రీవాణి, రవీందర్‌రెడ్డి, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

మహబూబాబాద్ రూరల్: కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం సంతోషదాయకమని, ఈ గెలుపు తెలంగాణలో పునరావృతం కావడం ఖాయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోరిక సాయిశంకర్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంపై జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, కాంగ్రెస్ నాయకులు హెచ్.వెంకటేశ్వర్లు, నర్సింగ శ్రీనివాస్, పద్మం ప్రవీణ్, బానోత్ భాస్కర్, ఎన్ఎస్ యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్ అన్సారీ, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ అంబాల శివకుమార్, సామ రాజవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్, వీఎస్.లక్ష్మీపురం, దామ్యతండ గ్రామాల్లో ఆదివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సంబురాలు జరుపుకున్నారు.

డోర్నకల్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆదివారం గ్రామాల్లో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. నాయకులు దరంసోత్ జగదీష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసం శేఖర్, ఉపేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: సంబురాల్లో పాల్గొన్న నాయకులు

కాంగ్రెస్ గెలుపు చారిత్రాత్మకం

తొర్రూరు: కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు చారిత్రాత్మకమని మాజీ టీపీసీసీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్ రావు అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సోమేశ్వర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కందాడి అచ్చిరెడ్డి, ధీకొండ శ్రీనివాస్, నలమాస సమ్మయ్య, జాటోతు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

నెహ్రూసెంటర్: మానుకోట మున్సిపల్ వార్డుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మామిండ్ల సాంబలక్ష్మి, నర్రా శ్రావణ్ డిమాండ్ చేశారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు వార్డులు పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మంద శంకర్, చిరంజీవి, శ్రీరామ్, బాలు, కుమార్, భద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులు హక్కులను సాధించుకోవాలి

నెహ్రూసెంటర్: వడ్డెర కులస్తులు ఐక్యమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని వడ్డెర కులస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలుమల్లు అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం జిల్లా అధ్యక్షులు శంకర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా శివరాత్రి ఐలుమల్లు మాట్లాడుతూ.. వడ్డెరులు ఎస్టీ సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ హక్కుల కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, నాగలక్ష్మి, సంజీవ, తిరుమలేష్, శ్రీనివాస్, సోమయ్య, 17 మండలాల అధ్యక్షులు కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెల్లికుదురు: తండ్రిని కోల్పోయి అనాథలైన పిల్లలకు మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ పులి రామలక్ష్మి రామచంద్రు ఆర్థికసాయం అందించారు. మండల కేంద్రానికి చెందిన నాగబెల్లి సురేష్, నాగబెల్లి ఉపేందర్ ఇద్దరు అన్నదమ్ములు ఆనారోగ్యంతో మృతిచెందారు. వారి కూతుర్లకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

నివాళి

కురవి: కురవి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు(వైస్ఎంపీపీ) దొంగలి నర్సయ్య తల్లి కనకమ్మ(80) ఆదివారం మృతి చెందింది. మాతృదినోత్సవం రోజునే తల్లిని కోల్పోవడంతో వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య విషాదంలో మునిగాడు. ఈమేరకు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, ఆత్మ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య, యూత్ నాయకుడు డీఎస్ రవిచంద్ర, రామునాయక్, తదితరులు నివాళులర్పించారు.

అమ్మప్రేమ వెలకట్టలేనిది..

- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవం

కేసముద్రం: ప్రపంచంలో వెలకట్టలేనిది అమ్మ ప్రేమ ఒక్కటేనని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో అమ్మానాన్న చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు గంజి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మ పేరున ట్రస్టును ఏర్పాటు చేసి, సమాజానికి సేవాకార్యక్రమాలు చేస్తున్న గంజి శ్రీనివాస్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

మహబూబాబాద్ అర్బన్: మాతృదినోత్సవం సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలోని హన్మంతునిగడ్డ హరిజనవాడలో దాసరి రాములు ఈశ్వరమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు, కూతుర్లు, మనవలు, మనమరాళ్లు ఆదివారం దాసరి గురువమ్మకు కాళ్లు కడిగా పాదాభివదనం చేసిచ కేక్ కట్ చేశారు.

మహబూబాబాద్ రూరల్: మదర్స్ డే వేడుకలను జిల్లా కేంద్రంలోని బ్లెస్స్ డ్ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బ్లెస్స్ డ్ చర్చి ఫాదర్ రెవరెండ్ ఏ.ప్రేమానందం సతీమణి స్టెల్లా మేరీ గ్రేస్ అమ్మగారిని సంఘ సభ్యులు సన్మానించి మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.



కేసముద్రం: ఇనుగుర్తిలో న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బ్లెస్సిడ్ చర్చిలో ..



మహబూబాబాద్ అర్బన్: గురువమ్మను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో ఈనెల 17న చేపట్టే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం ఇనుగుర్తిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వద్దిరాజు కిషన్ ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు సమావేశానికి తరలివచ్చే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం ఇనుగుర్తి మండల వడ్డెర సంఘం సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శంకర్‌నాయక్ జెండాను ఆవిష్కరించారు. వడ్డెర సంఘానికి కమ్యూనిటీ హాల్‌ను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ వోలం చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ దార్ల రామ్మూర్తి, ఎంపీటీసీ పింగిలి రజిత, శ్రీనివాస్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, బీఆర్ఎస్ నేత నీలం దుర్గేష్, కేసముద్రం సొసైటీ చైర్మన్ దికొండ వెంకన్న, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దామరకొండ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'హామీలతో మభ్యపెడితే ఫలితం అనుభవిస్తారు'



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

బయ్యారం: హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడితే రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రజల నుంచి తగిన ఫలితంను అనుభవిస్తారని సీపీఎం జిల్లా నాయకులు మండా రాజన్న అన్నారు. ఆదివారం బయ్యారంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టుతో మొదట బయ్యారం పెద్దచెరువుకు సాగునీటిని అందిస్తామని చెప్పిన బీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టు డిజైన్‌ను మార్చి చెరువుకు నీరు రాకుండా చేశారన్నారు. ఇటీవల బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బయ్యారం చెరువుకు సీతారామ నీళ్లను తీసుకొస్తామని మభ్యపెట్టే వ్యాఖ్యలు చేశారని ఇప్పటికైనా నీళ్లను తీసుకరాకపోతే తగిన గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు మధు, ఆనందరావు, చంటి, వెంకన్న, యాకూబ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

స్పందించకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం

బయ్యారం: సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు నిర్వహిస్తున్న సమ్మెపై ప్రభుత్వం స్పందించకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బయ్యారంలో వీఓఏలు నిర్వహిస్తున్న దీక్షకు ఆదివారం సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. 28రోజులుగా తీవ్రమైన ఎండలో నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కుంట ఉపేందర్, వీఓఏ యూనియన్ జిల్లా కన్వీనర్ మౌనిక, సీఐటీయూ మండల కన్వీనర్ వల్లాల వెంకన్న, వీఓఏ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గార్ల: వీఓఏలను సమ్మె గార్లలో ఆదివారం కొనసాగింది. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు, శోభారాణి, ఉమ, వినోద, స్వాతి, ఉమ, జ్యోతి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం: సమ్మెకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో చేపట్టిన సమ్మెలో వీఓఏల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలిశాల సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. సమ్మెలో కృష్ణవేణి, రోజా, అరుణ, రమేష్, రాధిక, విజయ, శోభా పాల్గొన్నారు.

గంగారం : ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓఏలు మౌనిక, కృష్ణవేణి, పురుషోత్తం డిమాండ్ చేశారు.

సీసీ రోడ్డుపై అడ్డంగా గోడ

- పట్టించుకోని అధికారులు
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన స్పందన లేదు

కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన కాలనీలో గతంలో నిర్మించి ఉన్న సీసీ రోడ్డుపై కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపట్టడం వలన రోడ్డుపై నడిచే పరిస్థితి లేకుండా పోయింది. గతంలో కురవి మాజీ సర్పంచ్ బానోత్ తుకారం నాయక్ కాలంలో ఆ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. సుమారు ఎనిమిది గృహాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అప్పటి సర్పంచ్ బానోత్ తుకారం నాయక్ లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించారు. కొన్ని నెలల క్రితం ఆ సీసీ రోడ్డుపై కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. సీసీ రోడ్డుకు అడ్డంగా గోడ మాదిరిగా నిర్మాణం చేయడం వల్ల రోడ్డుపై నడిచి వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. రోడ్డు పక్కన ఉన్న గృహాల ప్రజలు బస్టాండ్ నుంచి నడిచి వెళ్లన్నారు. రోడ్డు అవతల ఉన్న భూమి యజమాని జిల్లా కలెక్టర్‌కు ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై మరోమారు గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేసేందుకు రోడ్డు పక్కన భూమి యజమానులు, కాలనీలోని కొందరు గృహాల యజమానులు సిద్ధమైనట్లు సమాచారం. అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులు కొరడా ఝులిపిస్తారా? గ్రీవెన్స్‌సెల్ ఫిర్యాదులు బుట్టదాఖలేనా? వేచిచూడాల్సిందే మరి.



సీసీ రోడ్డుపై అడ్డుగా నిర్మించిన గోడ

నూతన కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలో రాణి రుద్రమ దేవి మినీ గూడ్స్ యూనియన్ నూతన కమిటిని ఎన్నుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా బండి సంతోష్, కార్యదర్శి కొమ్ము నరేష్, కోశాధికారి కొడారి సాగర్, ఉపాధ్యక్షుడు అజ్మీరా రాజు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

వీధులు నిర్మానుష్యం



డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో మండుటెండలతో వీధులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికి సాహసించకపోవడంతో వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

కంపుకొడుతున్న సైడ్ కాల్వలు

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలో డ్రైయినేజీ శుభ్రం చేయకపోవడంతో వ్యర్థపదార్థాలు, మురుగునీరు నిలిచిపోయి కంపుకొడుతుంది. దోమలు, ఈగలు చేరి జ్వరం, జలుబు, వాంతులతో రోగాల పాలవుతున్నారు. స్థానికులు, పాదాచారులకు దుర్వాసన వెదజల్లుతుంది. మున్సిపాలిటీలోని శివాలయం వీధి, పూలబజారు, సీతారాంపురం తదితర వీధులలో దుర్భర పరిస్థితి నెలకొన్నది. ఏడాది కాలంగా కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధంలోనే జీవనం సాగిస్తున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి వీధులలో పర్యటించి డ్రెయినేజీ వ్యవస్థను శుభ్రం చేయించి ప్రజలను రోగాల నుంచి బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.



పూలబజారు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు



మరిపెడ శివాలయం వీధిలో..

మున్సిపాలిటీకి తాగునీటి కష్టాలు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో తరచూ తాగునీటి సరఫరా నిలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం భగీరథ నీటి సరఫరా నిలవడంతో ప్రజలు బావులు చేతిపంపులను ఆశ్రయించారు. గత నెల రోజుల్లో ఐదు రోజులు నీటి సరఫరా నిలవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద చెరువులోని మూడు బోర్లు, చెరువు ప్రక్కన బావికి అమర్చిన విద్యుత్ మోటరు ద్వారా రాజుతండా, ఎస్సీ బీసీ కాలనీ, సుభాష్‌వీధి, నెహ్రూస్ట్రీట్‌లకు నీటిని సరఫరా చేస్తుండగా మిగతా పట్టణ ప్రాంతానికి భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. పలు కారణాలతో తరచూ భగీరథ నీటి సరఫరా నిలుస్తుండటం, పలు వీధుల్లో పైపులు పగిలి నీటి సరఫరా నిలుస్తుండటంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు షెడ్డు వద్ద విద్యుత్ మోటార్లు, విద్యుత్ లైను, పైపుల మరమ్మతులు పూర్తి చేసి మున్నేరు నుంచి ప్రజలకు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు.